
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
మంగళవారం 12 ఆగస్టు 2025



ఎఫ్‌ఏ-1 పరీక్షలు ప్రారంభం

సాలూరు రూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం నుంచి ఎఫ్‌ఏ-1 పరీక్షలు ప్రారంభమయ్యాయి. కూటమి ప్రభుత్వం విద్యానాణ్యత పెంచడానికి కొత్తగా ప్రవేశపెట్టిన అసెస్మెంట్ బుక్స్‌లో విద్యార్థులు ఈ పరీక్షలు రాశారు. మొత్తంగా 1408 ప్రభుత్వ పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించారు. తొలుత వాటిపై విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ప్రాథమిక పాఠశాలల్లో ఈ నెల 12 వరకు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఈ నెల 14వ తేదీ వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి.

పునర్విభజన కష్టాలు!



- నాడు అస్తవ్యస్తంగా జిల్లాలను ఏర్పాటు చేసిన వైసీపీ సర్కారు
- భామిని మండలవాసులకు తప్పని ఇబ్బందులు
- గతంలోనే వ్యతిరేకించినా పట్టించుకోని వైనం
- జిల్లాకేంద్రం పార్వతీపురం చేరుకోవాలంటే .. మూడు బస్సులు మారాల్సిందే..
- విద్య, వైద్య సేవలన్నీ శ్రీకాకుళం జిల్లాలోనే..
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

భామిని, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ సర్కారు అనాలోచిత నిర్ణయాల కారణంగా భామిని మండలవాసులు తీవ్ర అవస్థలు పడాల్సి వస్తోంది. ప్రధానంగా జిల్లాల విభజన వారికి శాపంగా మారింది. నాటి ప్రభుత్వం ప్రజాభిప్రాయసేకరణ చేపట్టకుండా.. భౌగోళిక పరిస్థితులు పట్టించుకోకుండా.. ఇష్టారాజ్యంగా కొత్త జిల్లాలను ఏర్పాటు చేసింది. దీంతో నేటికీ అనేకమంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్య, వైద్య సేవలను పూర్తిస్థాయిలో పొందలేక పోతున్నారు. జిల్లాకేంద్రం పార్వతీపురం చేరుకోవాలన్నా.. వ్యయప్రయాసాలకు గురవ్వాల్సి వస్తోంది. దీనిపై గతంలో వారు నిరసన కార్యక్రమాలు చేపట్టినా వైసీపీ సర్కారు పట్టించుకోలేదు. కాగా కొన్ని జిల్లాల పేర్లు మార్పు, పలు నియోజక వర్గాలు పక్క జిల్లాల్లో విలీన ప్రక్రియ ప్రతిపాదనలు నెలరోజుల్లో పూర్తికావాలని ఇటీవల సీఎం చంద్రబాబు ఆదేశించిన నేపథ్యంలో భామిని మండ లవాసుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఎన్నికల ప్రచారంలో భాగంగా గతంలో కొత్తూరు మండలంలో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు భామిని మండలాన్ని తిరిగి శ్రీకాకుళం జిల్లాలో చేర్చాలని కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి..

గత వైసీపీ ప్రభుత్వం ఎంతో హడావుడిగా కొత్త జిల్లాలను ఏర్పాటు చేసింది. ఈ క్రమంలోనే శ్రీకాకుళం జిల్లాలో చివరి మండలంగా ఉన్న భామిని పాలకొండ నియోజకవర్గంలో ఉండడంతో దానిని పార్వతీపురం మన్యం జిల్లాలో చేర్చారు. అప్పటికే అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న ఆ మండలం మన్యం జిల్లాలోకి వచ్చినా ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయిందని ఆ ప్రాంతవాసులు అభిప్రాయ పడుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు తప్ప పార్వతీపురం జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం వారికి ఉండడం లేదు. డిగ్రీతో పాటు ఉన్నత చదువుల కోసం విద్యార్థులు, వ్యాపారులు శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలానికి వెళ్లాల్సి వస్తోంది. ఆర్డీవో కార్యాలయాన్ని పార్వతీపురం నుంచి పాలకొండకు మారడంతో భామినితో పాటు గుమ్మలక్ష్మీపురం మండలవాసులకు కూడా ఇబ్బందులు తప్పడం లేదు. మొత్తంగా పాలనా సౌలభ్యం లేకపోవడంతో మన్యం జిల్లాలో భామిని మండలం పేరుకే అన్నట్టుగా ఉంది.



భామిని తహసీల్దార్ కార్యాలయం

పార్వతీపురం వెళ్లాలంటే.. ఒక రోజు ప్రయాణమే..

- భామిని నుంచి పార్వతీపురం చేరుకోవాలంటే భామిని మండల వాసులు నానా అవస్థలు పడుతున్నారు. 80 కిలోమీటర్లు దాటితే తప్ప జిల్లా కేంద్రానికి చేరుకోలేకపోతున్నారు. ఒడిశా రాష్ట్రం రాయగడ రోడ్డు మీదుగా, మరోవైపు శ్రీకాకుళం జిల్లా కొత్తూరు దాటించి వెళ్లాల్సి వస్తోంది. ఇందుకు మూడు

(మిగతా 8వ పేజీలో...)




ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

మరో నెలరోజుల్లో అందుబాటులోకి

వంద పడకల ఆసుపత్రి

- మంత్రి సంధ్యారాణి

సాలూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సాలూరు వంద పడకల ఆసుపత్రి మరో నెలరోజుల్లో అందుబాటులోకి రానుందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. సోమవారం ఆమె ఆసుపత్రి పనులను పరిశీలించారు. అన్ని ఫ్లోర్లను తనిఖీ చేశారు. మిగిలిన పనులు త్వరితగతిన పూర్తిచేసి పూర్తిస్థాయి వసతులతో ఆసుపత్రిని ప్రారంభించాలని ఆదేశించారు. పనుల నాణ్యతలో రాజీపడాల్సిన పనిలేదని తెలిపారు. ఇది వినియోగంలోకి వస్తే పేద, మధ్యతరగతి కుటుంబాలు, గిరిజనుల కష్టాలు తీరుతాయన్నారు. ఆమె వెంట టీడీపీ పట్టణ అధ్యక్షుడు తిరుపతి రావు, నాయకులు పరమేశు, వేణుగోపాల నాయుడు, యుగంధర్, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

చెప్పిన దానికంటే ముందే..

- డీఎస్సీ ఫలితాలు వెల్లడి
- కూటమి ప్రభుత్వం తీపికబురు



సాలూరు రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులకు కూటమి ప్రభుత్వం తీపికబురు అందించింది. చెప్పిన దానికంటే ముందే మెగా డీఎస్సీ ఫలితాలను ప్రకటించింది. తొలుత ఈ నెల 15న ఫలితాలు ప్రకటిస్తామని వెల్లడించినప్పటికీ ముందస్తుగా సోమవారం రాత్రి ప్రకటించారు. రాష్ట్రంలో 16,347 పోస్టుల భర్తీకి ఏప్రిల్ 20న మెగా డీఎస్సీ ప్రకటించారు. జూన్ 6 నుంచి జూలై 2 వరకు పరీక్షలు నిర్వహించారు. డీఎస్సీ కీని విడుదల చేశారు. అభ్యర్థుల నుంచి వచ్చిన అభ్యంతరాలను క్షుణ్నంగా పరిశీలించిన తర్వాత సవరించిన తుది కీ ప్రకారం నార్మలైజేషన్ ప్రక్రియ పూర్తి చేసి తుది డీఎస్సీ ఫలితాలను విడుదల చేశారు. అభ్యర్థులు ఫలితం తెలుసుకోవడానికి క్యాండిడేట్ లాగిన్‌లోకి వెళ్లి హాల్‌టిక్కెట్ నెంబర్, పాస్‌వర్డ్ ఎంటర్ చేయాలి. సర్వీసెస్ కనబడుతుంది. అక్కడ ఏపీ డీఎస్సీ ఫలితాలను సెలెక్ట్ చేస్తే స్కోర్ కార్డు వస్తుంది. స్కోర్ కార్డులో అభ్యర్థి పొందిన మార్కులు, టెట్ మార్కులు చూపిస్తూ.. క్వాలీఫైడ్, నాన్ క్వాలీఫైడ్ వివరాలొస్తాయి.

మహిళ అభ్యర్థులే అధికం..

ఉమ్మడి జిల్లా నుంచి 18,001 మంది వివిధ పోస్టులకు 31,354 దరఖాస్తులందించారు. వారిలో మహిళా అభ్యర్థులు 10,425 మంది, పురుష అభ్యర్థులు 7892 మంది ఉన్నారు. డీఎస్సీ పరీక్షలకు ఉమ్మడి జిల్లాలో 16,656 మందికి పైగా హాజరయ్యారు.

ఉమ్మడి జిల్లాలో 583 పోస్టులు

ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారు. మొత్తంగా 583 పోస్టులను చూపారు. మున్సిపల్, జడ్పీ, ఎంపీపీ, ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్జీటీలు 210, పాఠశాల సహాయకులు క్యాడర్‌లో తెలుగులో 14, హిందీలో 14, ఆంగ్లంలో 23,గణితంలో 8,భౌతికశాస్త్రంలో 32,జీవశాస్త్రంలో 20, సాంఘిక శాస్త్రంలో 62, పీఈటీ 63 మొత్తం 446 టీచర్ ఖాళీలు, ట్రైబల్ వెల్ఫేర్, ఆశ్రమ పాఠశాలల్లో ఎస్జీటీలు 60 పాఠశాల సహాయకుల క్యాడర్‌లో ఆంగ్లంలో 7, గణితంలో 25, భౌతిక శాస్త్రంలో 24, జీవశాస్త్రంలో 16,సాంఘిక శాస్త్రంలో 5 మొత్తం 137 టీచర్ పోస్టులు ఖాళీలను చూపించారు. ఈ ఖాళీలే కాకుండా డిఫరెంట్ ఏబుల్డ్ పాఠశాలల్లో రాష్ట్రవ్యాప్త యూనిట్‌గా చూపించిన 2,259 టీచర్ పోస్టుల్లో జోన్ ఒకటికి 400 కేటాయించారు. మరో రాష్ట్రం యూనిట్‌గా భర్తీ చేయనున్న 259 టీచర్ పోస్టులు సైతం ఉమ్మడి జిల్లాలో ఉన్న నిరుద్యోగ ఉపాధ్యాయులకు అందుబాటులోకి వచ్చాయి.



కలెక్టర్‌ను కలిసిన పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లు వైశాలి, స్వప్నిల్ జగన్నాథ్

విధుల్లోకి సబ్ కలెక్టర్లు

పార్వతీపురం, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లుగా నియామకమైన వైశాలి, పవర్ స్వప్నిల్ జగన్నాథ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత వారు కలెక్టరేట్‌లో కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, జేసీ శోభికను మర్యాద పూర్వకంగా కలిశారు. 2023 బ్యాచ్‌కు చెందిన ఈ ఐఏఎస్ అధికారులు శిక్షణ పూర్తి చేసుకుని నూతనంగా జిల్లాలో పోస్టింగ్‌లు పొందారు. ఇంతవరకు పాలకొండ, పార్వతీపురం సబ్ కలెక్టర్లుగా, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవోలుగా యశ్వంత్‌కుమార్ రెడ్డి, శ్రీవాత్సవ పనిచేశారు.

రైట్.. రైట్!

- స్త్రీ శక్తికి జీవో జారీ
- 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

సాలూరు రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించి కూటమి ప్రభుత్వం సోమవారం జీవో జారీ చేసింది. ఈ నెల 15 నుంచి స్త్రీశక్తి పథకం అమలు కానుందని స్పష్టం చేసింది. మహిళలు, బాలికలు,ట్రాన్స్‌జెండర్స్ పల్లెవెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెక్స్, సీటి ఆర్డనరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్‌ల్లో ఉచితంగా ప్రయాణించొచ్చు. ఉచిత ప్రయాణం చేసే మహిళలకు కండక్టర్లు జీరో ఫేర్ టికెట్ ఇవ్వనున్నారు. ప్రభుత్వం ఆ నిధులను ఆర్టీసీకి అందించనుంది. మహిళల భద్రత కోసం కండక్టర్లకు బాడీవేర్ కెమెరాలు, బస్సుల్లో సీసీ కెమెరాలను సైతం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. బస్సు స్టేషన్లలో

(మిగతా 8వ పేజీలో...)




సీతంపేట ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

జ్వరాలు తగ్గట్లే..

- సీతం పేట ఏరియా ఆసుపత్రికి రోగుల తాకిడి

సీతంపేట రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సీతంపేట మన్యంలో జ్వరాలు తగ్గుముఖం పట్టడం లేదు. ఏజెన్సీలో రోజురోజుకూ జ్వరపీడితులు పెరుగుతూనే ఉన్నారు. తీవ్ర జ్వరం, ఒంటి నొప్పులు, తలనొప్పి వంటి లక్షణాలతో రోగులు సీతంపేట ఏరియా ఆసుపత్రికి క్యూ కడుతున్నారు. సోమవారం ఏరియా ఆసుపత్రిలో 365 వరకు ఓపీ నమోదైంది. వారిలో 101 మంది జ్వరంతో బాధపడుతుండగా, 46 మంది ఇన్‌పేషెంట్లుగా చేరారు. ఒక మలేరియా పాజిటివ్ కేసు నమోదైంది. మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నట్లు ఆసుపత్రి పర్యవేక్షకుడు బి.శ్రీనివాసరావు తెలిపారు.

రైతన్నా.. జాగ్రత్త!

- వర్షాకాలంలో పంట పొలాల్లో అధికంగా విషసర్పాల సంచారం
- అప్రమత్తంగా ఉండాల్సిందే..

6లో

రైతుల సంక్షేమమే లక్ష్యం

- ప్రభుత్వ విప్ జగదీశ్వరి
- కురుపాంలో ట్రాక్టర్లతో అన్నదాతల విజయోత్సవ ర్యాలీ

6లో


ర్యాలీలో పాల్గొన్న విప్ జగదీశ్వరి

అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వ అడుగులు

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

7లో



హర్‌ఘర్ తిరంగా

విజయవంతం చేయాలి

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్


వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

పార్వతీపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): హర్‌ఘర్ తిరంగా మహోత్సవాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్ నుంచి సంబంధిత అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు, ర్యాలీలు , క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించాలన్నారు. మానవ హారాలు, మేళాలు నిర్వహించి ఆయా ఫొటోలను హర్‌ఘర్ తిరంగా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. మంగళవారం జిల్లావ్యాప్తంగా డీవార్మింగ్‌డేను నిర్వహించాలని ఆదేశించారు. అన్ని పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు భోజనం అనంతరం నిర్దేశించిన మోతాదులో ఆల్‌బెండాజోల్ మాత్రలు వేయించాలని తెలిపారు.

పట్టు తప్పితే అంతే..



భామిని, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): భామినిలో విద్యార్థులకు ప్రయాణ కష్టాలు తప్పడం లేదు. బస్సులకు వేలాడుతూ ఇలా రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఇటు బత్తిలి, అటు చిన్నదిమిలి నుంచి సుమారు 700 మంది రోజూ మండల కేంద్రానికి వస్తుంటారు. ఏపీ ఆదర్శ పాఠశాలలో 400, జూనియర్ కళాశాలలో 200 మంది, హైస్కూల్‌లో వందమందితో పాటు ఉద్యోగులు, వ్యాపారులు రాకపోకలు చేస్తుంటారు. అయితే పూర్తిస్థాయిలో బస్సులు లేకపోవడంతో వారికి ఇక్కట్లు తప్పడం లేదు. ప్రధానంగా విద్యార్థులు నిత్యం ప్రమాదకర స్థితిలో ప్రయాణించాల్సి వస్తోంది. సోమవారం సాయంత్రం 4.15 గంటలకు రావాల్సిన బస్సు అరగంట ఆలస్యంగా వచ్చింది. దీంతో భామిని బస్టాప్‌లో జూనియర్ కళాశాల, ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఒకేసారి పోటెత్తారు. బస్సులో ఫుట్‌పాత్‌పై నిలబడి కొందరు.. మరికొందరు వేలాడుతూ.. ప్రయాణించారు. అయితే పట్టుతప్పితే ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో కొందరు వేరే బస్సు కోసం ఎదురుచూస్తూ అక్కడే ఉండిపోయారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించాలని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆ కుర్రాడి ఆలోచన.. అపురూపం



బ్యాటరీతో నడిచేకారును రూపొందించిన శంకరరావు

బొబ్బిలి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద తయారు చేస్తున్నట్టే.. పారేసిన పరికరాలను ఉపయోగకరంగా ఎందుకు మలచకూడదని తనను తాను ప్రశ్నించుకున్న ఆ యువకుడు మెదడుకు పదును పెట్టాడు. ఆలోచనను ఆచరణలో పెట్టాడు. ఓ మూలన పడేసిన పరికరాలు, పారేసిన వస్తువులను సేకరించి ప్రయోగాలు ప్రారంభించాడు. కొద్ది నెలల పాటు శ్రమించాక తను అనుకున్నది సాధించాడు. బ్యాటరీతో నడిచే కారుతో పాటు సైకిల్, వ్యవసాయ యంత్రాలను తయారు చేసి అందరినీ అబ్బురపరుస్తున్నాడు. కేవలం ఐటీఐ చదివిన బొబ్బిలి మండలం మెట్టవలస గ్రామానికి చెందిన ఉంగట్ల శంకరరావు తన ఆవిష్కరణలతో అందరి చేత భళా అనిపించుకుంటున్నాడు.

ఉంగట్ల శంకరరావు ఐటీఐలో ఎలక్ట్రీషియన్ ట్రేడ్‌లో శిక్షణ పొందాక తాను స్వయంగా ఏదైనా తయారు చేయాలనుకునేవాడు. ట్రైనింగ్‌లో నేర్చుకున్న అంశాల ఆధారంగా ఎలక్ట్రికల్ పరికరాలతో చిన్నచిన్న ప్రయోగాలు చేసేవాడు. అలా కొద్దిరోజులు గడిచాక వాహనాలను, సాగు పరికరాలను తయారు చేస్తే అందరికీ ఉపయోగపడతాయని అనుకున్నాడు. ఆచరణలో పెట్టేందుకు పెట్టుబడి సమస్య ఎదురైంది. అయినా తను అనుకున్న సంకల్పాన్ని వీడలేదు. ఆలోచనలకు పదును పెట్టాడు. వృథాగా వదిలేసిన పరికరాలు, వస్తువులతో యంత్రాలు తయారు చేస్తే పెద్దగా పెట్టుబడి అవసరం ఉండదని భావించాడు. వెంటనే రంగంలోకిదిగాడు. ఇంజనీరింగ్ పట్టా తీసుకున్న వారికి ఏమాత్రం తీసిపోని విధంగా పారేసిన, వృథాగా పడేసిన వాటిని సేకరించి కొత్తరూపు ఇవ్వడం ప్రారంభించాడు. పాత ఇనుప సామగ్రితో రెండు నెలల పాటు శ్రమించి కేవలం రూ.50 వేలు ఖర్చుచేసి బ్యాటరీతో నడిచే కారును రూపొందించాడు. గంట పాటు చార్జింగ్ చేస్తే 30 కిలోమీటర్ల దూరం ప్రయాణించేలా సిద్ధం చేశాడు. అలాగే పాతసైకిల్‌కు 24 వాల్టుల బ్యాటరీని, దానికి సరిపడా మోటారును అమర్చాడు. ఆ బ్యాటరీని నాలుగుగంటల పాటు చార్జింగ్ చేస్తే 35 కిలోమీటర్ల స్పీడుతో 50 కిలోమీటర్ల ప్రయాణ సామర్థ్యం కలిగిన బ్యాటరీ సైకిల్‌ను రూపొందించాడు.

- పారేసిన పరికరాలతో యంత్రాలు
- వదిలేసిన వస్తువులతో పరికరాలు
- ఆకట్టుకుంటున్న శంకరరావు సృజన
- వినూత్న ఆవిష్కరణలతో ప్రతిభ చాటుతున్న యువకుడు

- భవన నిర్మాణ కార్మికులకోసం తక్కువ పెట్టుబడితో సరుకు రవాణా పరికరాన్ని కనుగొన్నాడు. కేవలం వెయ్యి రూపాయలు వెచ్చించి పాత ఇనుప సామగ్రితో అల్యూమినియం ట్రాక్‌కు మోటారును అమర్చాడు. భవన కార్మికులకు పైఅంతస్తులకు నిర్మాణ సామగ్రిని తీసుకెళ్లేందుకు వీలుగా ఈ పరికరాన్ని తయారు చేశాడు. రైతులకు వినియోగమయ్యే గాలి పంకా, దుక్కి యంత్రాలను తయారు చేశాడు. సైకిల్‌పై పెద్దసైజు బరువులను మోసుకెళ్లేలా మోటార్లను అమర్చాడు. దివ్యాంగుల కోసం నాలుగు చక్రాలతో కూడిన వీల్‌చైర్‌ను మోటారు సాయంతో రూపొందించాడు. ఇలా అనేక ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాడు.



బ్యాటరీతో నడిచే సైకిల్



భూమిని దున్నే పరికరం

శంకరరావును దత్తత తీసుకోవాలి

మా గ్రామానికి చెందిన ఉంగట్ల శంకరరావు తన సొంత తెలివితో అనేక ఆవిష్కరణలు చేయడం ఆనందంగా ఉంది. అతడికి ఇంకా రాణించే సత్తా ఉంది. ఏదైనా ఐఐటీ లాంటి సంస్థలు శంకరరావును ప్రోత్సహించి తగిన శిక్షణ ఇస్తే ఇంకెన్నో అధునాతన ఆవిష్కరణలు ఆ యువకుడి చేతిలో రూపొందుతాయి.

- కాజా వేణుగోపాలరావు, రిటైర్డు బ్యాంకు మేనేజరు, మెట్టవలస

దేశ ఔన్నత్యాన్ని దశదిశలా చాటిన స్వామి వివేకానంద జయంతిని (ఆగస్టు 12న) జాతీయ యువజన దినోత్సవంగా జరుపుకుంటున్నాం. నిరంతరం కొత్త ఆలోచనలతో ముందుకు వెళ్లాలని చెప్పేవారు ఆయన. అదే స్ఫూర్తిదాయక పంథాలో నడుస్తున్న జిల్లా యువత గురించి ప్రత్యేక కథనాలు..

- నేడు అంతర్జాతీయ యువజన దినోత్సవం



బెటాలియన్ పరిధిలో మొక్కలు నాటుతున్న కుమారి

సేవకు అమ్మే స్ఫూర్తి

- ఆదర్శంగా నిలుస్తున్న ఆర్మీ యువ ఉద్యోగి



రంభ కుమారి

బొబ్బిలి, ఆగస్టు11 (ఆంధ్ర జ్యోతి): ఈమె పేరు రంభ కుమారి, అ స్సాం రైఫిల్ ఉమెన్ బెటాలియన్‌లో పనిచేస్తోంది. స్వగ్రామం బొబ్బిలి మండలం కోమ టిపల్లి గ్రామం. చిన్నతనంలోనే తండ్రి సత్యంను కోల్పోయింది. తల్లి పార్వతి కాయకష్టం చేసుకొని ఒక్కగానొక్క కూతురిని చదివించుకుంది. అమ్మ పడుతున్న కష్టాలను అనునిత్యం గమనిస్తూ పెరిగిన ఆమె కష్టపడి ఉద్యోగం సాధించాలనుకుంది. రేయింబవళ్లూ చదువుతూ ఆర్మీకి ఎంపిక అయ్యేందుకు సాధన చేసింది. 2021 ఏప్రిల్‌లో నాగాలాండ్‌లో అస్సాం రైఫిల్స్ ఉమెన్‌గా ఉద్యోగం సాధించింది. నాటి నుంచి తల్లిని ప్రేమగా సాకడమే కాక గ్రామానికి చెందిన పేదలకు తన వంతు సహకారం అందిస్తోంది. తాను పడిన కష్టాలు ఇంకే పేద యువతీయువకులు పడకూడదని వారి చదువు, ఇతర అవసరాలకు చేతనైన సాయం అందిస్తూ రంభ కుమారి ఆదర్శంగా నిలుస్తోంది.

వంగర కేజీబీవీకి రాష్ట్రస్థాయి అవార్డు

- 15న సీఎం చేతుల మీదుగా ప్రదానం

విజయనగరం కలెక్టరేట్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో వంగర కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ఉత్తమ అవార్డుకు ఎంపికైంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 352 కేజీబీవీల్లో విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలను పరిగణలోకి తీసుకుని ఎంపిక చేసిన టాప్-10 పాఠశాలల్లో వంగర ఒకటిగా నిలిచింది. దీంతో ఈ నెల 15న నిర్వహించనున్న అవార్డు ప్రదానోత్సవంలో పాల్గొనాలని ప్రిన్సిపాల్‌కు ఆహ్వానం అందింది. ఈ అవార్డును సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా విజయవాడలో నిర్వహించనున్న కార్యక్రమంలో అందుకోనున్నారు. అవార్డుకు ఎంపిక కావడంపై కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ సోమవారం హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల సిబ్బందిని, జిల్లా విద్యాశాఖ అధికారిని, సమగ్ర శిక్ష ఏపీసీని అభినందించారు.

బంగారు కుటుంబాల గుర్తింపు

జిల్లాలోని బంగారు కుటుంబాల దత్తత ప్రక్రియ ఈ నెల 15వ తేదీ నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. జిల్లాలోని మొదటి 67,066 బంగారు కుటుంబాలను గుర్తించగా, వడపోతల అనంతరం ఆ సంఖ్య 60,612కు తగ్గిందని కలెక్టరు చెప్పారు. ఇంకా ఎవరైనా అనర్హులు ఉంటే తొలిగించాలని చెప్పారు. ఇప్పటివరకూ 37,150 కుటుంబాలకు ప్రక్రియ పూర్తి చేశారని, ఈ మూడు రోజుల్లో శతశాతం పూర్తి చేస్తామన్నారు. రానున్న నాలుగు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమం పై డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, టూరిజం అధికారి వివరించారు. ఇందులో భాగంగా కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ వద్ద జాతీయ జెండా చేతబట్టి కలెక్టర్ అంబేడ్కర్ సెల్ఫీ దిగారు.

14న జిల్లా సమీక్ష సమావేశం

ఈనెల 14న జిల్లా సమీక్ష సమావేశం (డీఆర్‌సీ) నిర్వహించనున్నట్టు కలెక్టర్ అంబేడ్కర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి వంగలపూడి అనిత, జిల్లాకు చెందిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ప్రజా ప్రతినిధులు హాజరుకానున్నట్టు తెలిపారు. సమావేశంలో నీటి పారుదల, వ్యవసాయం, విద్య, వైద్య, తాగునీటి పథకాలపై సమీక్షించనున్నట్టు తెలిపారు.

శివారు భూములకు సాగునీరు అందించాలి

శివారు భూములకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టరు బీఆర్ అంబేడ్కర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో సుమారు 60 శాతం సాగు విస్తీర్ణానికి కాలువల ద్వారా సాగునీరు అందుతోందని, మిగిలిన భూములు వర్షాలపై ఆధారపడి ఉన్నాయన్నారు. ప్రసుత్తం రిజర్వాయర్లలో నీటి మట్టం సంతృప్తికంగానే ఉందని, ఈ ఏడాది పంటలకు ఇబ్బంది ఉండన్నారు. జిల్లాలోని ఖరీఫ్‌లో సాధారణ విస్తీర్ణం 91,214 హెక్టార్లకు గాను, ఇప్పటి వరకూ 44,231 హెక్టార్లలో ఊబాలు జరిగాయన్నారు. సమావేశంలోని సీపీవో బాలాజీ, వ్యవసాయ శాఖ జేడీ రామారావు తదితరులు ఉన్నారు.



జాతీయ జెండా పట్టుకుని సెల్ఫీ దిగుతున్న కలెక్టర్ అంబేడ్కర్

విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న మోడల్ స్కూల్స్ జేడీ తాహెరా సుల్తానా

భోగాపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా బోధన చే యాలని ఏపీ మోడల్ స్కూల్స్ జాయింట్ డైరెక్టర్ తాహెరా సుల్తానా సూచించారు. భోగాపురం ఏపీ మోడల్ స్కూల్‌లో సోమవారం విజయనగరం, మన్యం, శ్రీకాకుళం, విశాఖ, అనకాపల్లి జిల్లాలకు చెందిన ఏపీ మోడల్ స్కూల్స్ ప్రిన్సిపాల్స్‌తో సమీక్షించారు. నూతన విధానంలో విద్యా బోధన, పరీక్షల నిర్వాహణపై వివరించారు. అంతకుముందు విద్యార్థులతో మాట్లాడి పలు పాఠ్యంశాలపై అడిగి వారి సామర్థ్యం గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్జేడీ విజయభాస్కర్, ఎంఈవో-2 బాలిపల్లి చంద్రమౌళి, మోడల్ స్కూల్స్ ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

దేశభక్తిని చాటి చెప్పేందుకే హర్‌ఘర్ తిరంగా

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం టౌన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): దేశభక్తిని ప్రపంచ వ్యాప్తంగా చాటి చెప్పాలనే ఉద్దేశంతో ప్రధాని నరేంద్ర మోదీ హర్‌ఘర్ తిరంగా కార్యక్రమం చేపట్టారని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా విజయనగరం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కోట జంక్షన్ నుంచి గంటస్తంభం వరకు జాతీయ పతాక ర్యాలీని ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశ సమైక్యతను చాటిచెబుతూ ఆగస్టు 15న స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రతి పౌరుడు భాగస్వామ్యం అవుతూ ప్రతి ఇంటిపైన మువ్వన్నెల జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్ 2047 సంకల్పంతో ప్రతిఒక్కరూ దేశం కోసం, రాష్ట్ర కోసం పాటుపడాలని, భారతదేశాన్ని అగ్రరాజ్యాల వరుసలో నిలబెట్టాలని విజ్ఞప్తి చేశారు. కోట జంక్షన్ వద్ద నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన హర్‌ఘర్ తిరంగా సెల్ఫీ స్టాండ్‌లో జాతీయ జెండా చేతబట్టుకుని మంత్రి సెల్ఫీ దిగారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, తూర్పు కాపు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పాలవలస యశస్విని, మున్సిపల్ కమిషనర్ పల్లి నల్లనయ్య, పర్యాటక అధికారి కుమారస్వామి, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న మంత్రి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు



కురుపాం రోడ్డులో అన్నదాతల ర్యాలీ

రైతుల సంక్షేమమే లక్ష్యం

- ప్రభుత్వ విప్ జగదీశ్వరి
- కురుపాంలో ట్రాక్టర్లతో అన్నదాతల విజయోత్సవ ర్యాలీ

కురుపాం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. 'అన్నదాత సుఖీభవ' నిధులు ఖాతాల్లో జమైన సందర్భంగా సోమవారం ఆమె ఆధ్వర్యంలో కురుపాంలో రైతులు ట్రాక్టర్లతో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. మూలిగూడ జంక్షన్ నుంచి ధూళికేశ్వర స్వామి వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థిక స్థితి బాగోలేకపోయినా.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ సీఎం చంద్రబాబు నాయుడు నెరవేరుస్తున్నారని తెలిపారు. పీఎం కిసాన్- అన్నదాత సుఖీభవ కింద తొలివిడతగా అందించిన రూ.7వేలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కూటమి శ్రేణులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రైతన్నా.. జాగ్రత్త!



పాలకొండ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): అసలే వర్షాకాలం.. పంట పొలాల్లో పాముల సంచారం అధికంగా ఉండే కాలం. ఖరీఫ్ పనుల్లో నిమగ్నమైన అన్నదాతలు అప్ర మత్తంగా ఉండాల్సిన సమయం. పంట పొలాలకు వెళ్లే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. విషసర్పాల కాటుకు గురై జిల్లాలో ఎంతోమంది రైతులు ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవడం శ్రేయస్కరం. పాము లేదా విష కీటకాలు ఏమైనా కాటు వేస్తే తక్షణమే ఆసుపత్రికి వెళ్లి వైద్యసేవలు పొందాలి. నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాలకే ముప్పు. పాము కాటుకు గురైన వ్యక్తి ఒత్తిడికి గురికాకుండా చూసుకోవాలి. తద్వారా ప్రమాదం నుంచి బయటపడొచ్చు.

- వర్షాకాలంలో పంట పొలాల్లో అధికంగా విషసర్పాల సంచారం
- అప్రమత్తంగా ఉండాల్సిందే..
- పాము కాటువేసిన వెంటనే వైద్య చికిత్స తప్పనిసరి
- లేకుంటే ప్రాణాలకే ముప్పు
- ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న మందులు
- ఏ మాత్రం పనిచేయని పసరమందులు, నాటు వైద్యం

పాములన్నీ విషపూరితం కాదు..

పాములన్నీ విషపూరితం కాదు. 15 శాతం సర్పాలతోనే ప్రమాదం ఉంది. అదేవిధంగా 50 శాతం పాము కాట్లు ప్రమాదం లేనివే. గాయమైతే చికిత్స చేసుకుంటే నయం అవుతాయి. నాగుపాము, రక్తపింజర, కట్ల , ఉల్లిపాము, కొండచిలువ తదితర పాములు ప్రమాదకర విషసర్పాలుగా చెప్పొచ్చు. జెర్రిపోతు, నీరుగడ్డి, మంటిబుక్కుడం తదితర వంటి పాములు కాటు వేసినా ఏమంత ప్రమాదం కాదు. కానీ చికిత్స అవసరం.

అవి ఏ మాత్రం పనిచేయవు..

పాముకాటుకు గురైన వారు ఎట్టి పరిస్థితుల్లోనూ టెన్షన్ పడకూడదు. ఆందోళన చెందితే గుండె పోటుకు గురయ్యే అవకాశాలున్నాయి. ప్రాథమిక చర్యగా కాటు వేసినభాగంలో కట్టుకట్టాలి. వెంటనే చికిత్స నిమిత్తం దగ్గరలోని ఆసుపత్రికి వెళ్లాలి. ఏ పాము కాటు వేసిందో బాధితులు చెబితే దానికి తగిన చికిత్సను వైద్యులు అందిస్తారు. పాము కాటు వేసిన చోట కొన్ని రకాల ఆకు రసాలను పిండడం మంచి పద్ధతి కాదు. మరికొందరు మంత్రాలను నమ్ముతారు. అవి ఏమాత్రం పనిచేయవు. ఇలా చేస్తే ప్రాణాలకే ముప్పు. పసరమందులను నమ్మి ప్రాణాలు మీదకు తెచ్చుకోకూడదు.

అందుబాటులో వైద్యం..

పాముకాటుకు గురైన వారికి అ ందుబాటులోనే వైద్యసేవలు ఉ న్నాయి. జిల్లాలోని అన్ని పీ హెచ్‌సీ, సీహెచ్‌సీ, యూపీ హెచ్‌సీ, ఏరియా ఆసుపత్రుల్లో యాంటీ స్నేక్ ఇంజక్షన్లు అందు బాటులో ఉన్నాయి. సకాలంలో ఆసుపత్రులకు వెళ్లడం వల్ల ప్రాణాపాయం నుంచి బయట పడొచ్చు. పాముకాటుకు గురై వారు వైద్యుల సూచనలు, సలహాలు పాటించాలి.

చికిత్స చేసుకోవాలి

విష సర్పాలు, విషకీటకాలు కాటు వేస్తే వెంటనే ఆసుపత్రిని ఆశ్రయించాలి. విధిగా విరుగుడు ఇంజక్షన్లు వేసుకోవాలి. ఇలా చేయడం ద్వారా సకాలంలో రోగులు కోలుకుంటారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో విరివిగా విషం విరుగుడు మందులు అందుబాటులో ఉన్నాయి.

- ఎస్.భాస్కరరావు, డీఎంహెచ్‌వో, పార్వతీపురం

ఈ జాగ్రత్తలు తీసుకోవాలి..

ధాన్యపు గాదెలు, గడ్డి వాములు పరిసరాలు, తడిగా ఉన్న ప్రాంతాల్లో, పశువుల శాలలో ఎండు కలప, పిడకలు తీసే క్రమంలో , సాగునీటి నిర్వహణ కోసం, పంట పొలాల్లో వివిధ పనుల నిమిత్తం వెళ్లే సమయంలో జాగ్రత్తలు పాటించాలి. రాత్రి సమయాల్లో పంట పొలాలకు వెళ్లాల్సి వస్తే చేతికర్ర, టార్చిలైటు వినియోగించాలి. గోడ మధ్యలో కూడా పాములు సంచరించే అవకాశం ఉంది. ఇంటి పరిసరాల్లో పిచ్చిమొక్కలు పెరగకుండా చూసుకోవాలి. పంట పొలాలకు దగ్గరలో ఉండే ఇళ్ల వద్ద కూడా పాములు సంచరించే అవకాశం ఉంది. చెత్తాచెదారం లేకుండా చూడాలి. ఈ సీజన్‌లో కురిసే వర్షాలకు విషసర్పాలు, విష పురుగులు వరదనీటిలో కొట్టుకుని మైదాన ప్రాంతాలకు చేరుతాయి. ఈ క్రమంలో ఏజెన్సీ ప్రాంత ప్రజలతో పాటు మైదాన ప్రాంత ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి.





వ్యవసాయ పనులు చేస్తున్న రైతులు

సమస్యలపై సానుకూలంగా స్పందించాలి

- ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో ఫిర్యాదుదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి, చట్ట పరిధిలో తక్షణమే పరిష్కరించాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించి 37 వినతులు స్వీకరించారు. వీటిలో భూ తగాదాలకు సంబంధించి 16, కుటుంబ కలహాలకు సంబంధించి 2, మోసాలకు పాల్పడినట్టు 2, ఇతర అంశాలకు సంబంధించి 15 ఫిర్యాదులు ఉన్నాయి. వాటి పూర్వాపరాలు విచారణ చేసి ఫిర్యాదు అంశాలు వాస్తవమైనట్టయితే, చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని ఎస్పీ పోలీసు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ సౌమ్యలత, ఎస్‌బీ సీఐ లీలారావు, డీసీఆర్‌బీ సీఐ సుధాకర్, ఎస్ఐ రాజేష్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతన్న ఎస్పీ వకుల్ జిందాల్

ప్రభుత్వ స్థలాల రీసర్వే

- జేసీ సేతు మాధవన్

విజయనగరం కలెక్టరేట్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ స్థలాలు, భూములు రీసర్వే జరుగుతుందని ప్రభుత్వ అధికారులంతా వారి భూముల్ని పరిరక్షించుకోవడాని ఇది మంచి అవకాశామని సర్వే అధికారులకు సహకరించి శాఖలకు సంబంధించి భూముల్ని రీ సర్వే చేయించుకోవాలని జేసీ సేతు మాధవన్ తెలిపారు. సోమవారం పీజీఆర్ఎస్ అనంతరం అధికారులతో మాట్లాడుతూ గ్రామలు, ప్రభుత్వ భూములు, సంస్థల అతుకుబడి భూములు, సరిహద్దులను నిర్ణయించడానికి నవంబరు నెలలోగా రీ సర్వే జరపనున్నట్టు తెలిపారు. రెవెన్యూ, దేవదాయ శాఖ అధికారులు, అటవీ శాఖ అధికారులు, పంచాయతీ, భూసేకరణ అధికారులు, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, జిల్లా రిజిస్ట్రార్ తదితర శాఖ అధికారులు వారి భూములను సర్వే చేసుకుని సరిహద్దులు నిర్ణయించుకోవాలని, మ్యుటేషన్ చేయించుకోవాలన్నారు.

జెండా ఆవిష్కరించనున్న జిల్లా మంత్రి

విజయనగరం కలెక్టరేట్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ సారి జిల్లా ఇన్‌చార్జి మంత్రులకు బాధ్యతల్లో మార్పులు, చేర్పులు చేపట్టింది. గతంలో స్వాతంత్ర దినోత్సవం రోజున ఇన్‌చార్జి మంత్రులు జాతీయ జెండాను ఆవిష్కరించేవారు. ఈ సారి అలాకుండా ఈ ఏడాది ఆగస్టు 15న ఉచిత బస్సు పథకాన్ని ప్రభుత్వం ప్రారంభిస్తున్న నేపథ్యంలో సొంత జిల్లాలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ జెండాను ఆవిష్కరించి, మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభించనున్నారు.

ఆల్బెండజోల్ మాత్రలు వేయాలి

భోగాపురం(పూసపాటిరేగ), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నులి పురుగుల నివారణకు 1నుంచి 19 సంవత్సరాల వారికి ఆల్బెండజోల్ మాత్రలు వేసేలా చూడాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారిణి పి.అచ్యుతకుమారి సూచించారు. స్థానిక పీహెచ్‌సీని ఆమె సోమవారం సందర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 12న నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా అన్ని పీహెచ్‌సీల పరిధిలో నులిపురుగుల నివారణ మాత్రలు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

కొత్తవలస, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కొత్తవలస జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు.. ఉత్తరాంధ్ర జిల్లా ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడుకు కోరారు. సోమవారం ఆయన కొత్తవలస జడ్పీ హైస్కూల్‌తో పాటు ఇటీవల అగ్నిప్రమాదం సంభవించిన తుమ్మికాపల్లి కేజీబీవీని సందర్శించారు. ఈసందర్భంగా ఎస్ఏ-1 పరీక్షల తీరు తెన్నులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు, సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కొత్తవలస జడ్పీ హైస్కూల్ హెచ్ఎం సీహెచ్‌ఈశ్వరరావు, పీఆర్టీయూ నాయకుడు చుక్క ఈశ్వరఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం కష్టపడితే పదవులు వస్తాయి

కొత్తవలస, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): పార్టీలో కష్టపడినవారికి పదవులు వస్తాయని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. కొత్తవలస పీఏసీఎస్ అధ్యక్షుడిగా కోళ్ల వెంకటరమణ(శ్రీను), డైరక్టర్లుగా గొంప పోతునాయుడు, బూసాల సూర్యనారాయణ సోమవారం కొత్తవలసలో బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పార్టీ నాయకులు కేబీపీ రాంప్రసాద్, గొరపల్లి రాము, పీవీ రత్నాజీ, లాలం అర్జునరావు పాల్గొన్నారు.

ప్రధానిని కలిసిన ఎంపీ



విజయనగరం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు ఆధ్వర్యంలో టీడీపీ ఎంపీల బృందం ప్రధాని నరేంద్ర మోదీని సోమవారం పార్లమెంటు హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా రామ్మోహన్‌నాయుడు.. ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడుని ప్రధానికి పరిచయం చేశారు. దీంతో ప్రధాని.. కలిశెట్టి తనకు తెలుసునని, రెగ్యులర్‌గా సమావేశాలకు హాజరవుతారని, కొత్త విషయాలను అన్వేషిస్తారని ప్రతిస్పందించారు. ఎంపీ కలిశెట్టిని దగ్గరకు తీసుకుని అభినందించారు.

బకాయిలు చెల్లించండి

విజయనగరం టౌన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కంది వెంకటరమణ కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమాన్ని జిల్లా సర్వజన ఆసుపత్రి ఆవరణలో సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను చెల్లించాలని, పీఆర్సీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బాలాజీ పాణిగ్రాహి, సంయుక్త కార్యదర్శి జక్కపు ఉమామహేశ్వరరావు, జిల్లా సర్వజన ఆసుపత్రి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

టికెట్ సమస్యలను పరిష్కరించాలి

విజయనగరం టౌన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో ఈనెల 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత ప్రయాణాన్ని ప్రభుత్వం కల్పించినందున టికెట్ విషయంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.వెంకటరావు, కార్యదర్శి వి.రాములు కోరారు. ఈ మేరకు జిల్లా రవాణా అధికారిణి వరలక్ష్మికి సోమవారం సాయంత్రం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా రాములు మాట్లాడుతూ ప్రతి బస్సులో చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేయాలని, రద్దీకి అనుగుణంగా బస్సులు వేయాలని, ఫుట్‌పాత్ ప్రమాదాలను నియంత్రించేందుకు హైడ్రాలిక్ డోర్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. ఫ్రీ టికెట్ విషయంలో సిబ్బందికి ఎదురయ్యే సమస్యలపై కేసులు నమోదు చేయకుండా తనిఖీ అధికారులకు ఆదేశాలు జారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపో అధ్యక్షుడు ఎస్‌కే.రఫీ, డిపో ప్రచార కార్యదర్శి జేఎస్.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వ అడుగులు

● మంత్రి కొండపల్లి శ్రీనివాస్

గజపతినగరం, ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం అడుగులు వేస్తుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి క్లస్టర్ ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో సమస్యలను పరిష్కరించి అభివృద్ధి పథంలో నడిపించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నియోజకవర్గంలో రూ.120కోట్లతో పల్లె పండుగ పనులు చేపట్టామని, రూ.50 కోట్లు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. అలాగే జలజీవన్ మిషన్ పథకానికి సంబంధించి రూ.5కోట్లు నిధులు మంజూరు కావల్సిఉందన్నారు. నిధులు మంజూరు అయిన వెంటనే గజపతినగరం, బొండపల్లి మండలాల్లో పనులు చేపట్టేవిధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గజపతినగరంలో రైతు బజార్‌కు స్థల సేకరణ చేపట్టి కూరగాయల రైతులను ఆదుకునే విధంగా ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణ పనులు తుది దశకు చేరుకోవడంతో వైద్యఆరోగ్య శాఖ మంత్రితో ప్రారంభోత్సవం చేయడంతోపాటు వైద్య సిబ్బంది పోస్టుల ఖాళీలను భర్తీ చేస్తామని చెప్పారు. గజపతినగరం మండలకేంద్రంలో అదనపు పీహెచ్‌సీ భవనం ఏర్పాటుకు జిన్నాం, ముచ్చర్ల గ్రామాలను ఎంపిక చేసి పీహెచ్‌సీ భవనం ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. మెంటాడ రైల్వే గేటు వద్ద రైల్వే వంతెనకు సంబంధించి రూ.46.86 కోట్లు నిధులు మంజూరు కావడంతో అధికారులు సర్వే చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు కొండపల్లి కొండలరావు, ఏఎంసీ చైర్మన్ లెంక బంగారునాయుడు, మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, దత్తిరాజేరు, గంట్యాడ మండల పార్టీ అధ్యక్షుడు చప్పా చంద్రశేఖర్, కొండపల్లి భాస్కరనాయుడు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

పీజీఆర్ఎస్‌కు 149 వినతులు

● స్వీకరించిన కలెక్టర్, జేసీ, డీఆర్వోలు

విజయనగరం కలెక్టరేట్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించి పీజీఆర్ఎస్‌లో వివిధ సమస్యలపై 149 వినతులు వచ్చాయి. వీటిని కలెక్టర్ డా.బీఆర్ అంబేడ్కర్, జేసీ సేతుమాధవన్, డీఆర్వో శ్రీనివాస్‌మూర్తి, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు స్వీకరించారు. ప్రతిరోజూ లాగిన్ అయిన అధికారులు వినతులను చూడాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే రీఓపెన్ కేసులు కూడా పూర్తిగా విచారణ జరిపి ముగించాలన్నారు. వచ్చిన 149 వినతుల్లో భూ సమస్యలకు సంబంధించి 52, డీఆర్‌డీఏ 27, మున్సిపాల్టీకి 8, విద్యా శాఖకు 8, హౌసింగ్‌కు 3, వైద్య శాఖకు 9, విద్యుత్ శాఖకు 5 వినతులు వచ్చాయి.

మా ఊరిని ప్రభుత్వం అమ్మేసింది

తమ గ్రామానికి చెందిన భూమిని, నివాసం ఉంటున్న ఇళ్లను జిందాల్ కంపెనీకి రిజిస్ట్రేషన్ అయినట్లు బయట పడిందని ఎస్.కోట మండలం కిల్తంపాలెం పంచాయతీ పరిధిలో గల దెపూర్రు గ్రామానికి చెందిన కొంతమంది పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం అందించారు. ఈ సర్వేలో 146-6లో సుమారు 13 మంది మంది కుటుంబాలు నివశిస్తున్నాయి, 33 ఎకరాలు భూమి కూడా ఉంది, ఈ సర్వే నెంబరులో గతం ప్రభుత్వం హయంలో ఇళ్ల స్థలాలు ఇచ్చారని ఫిర్యాదు చేశారు. ఇందులో గిరిజనులు ఇళ్ల రిజిస్ట్రేషన్ చేస్తామంటూ వన్‌టైం సెటిల్‌మెంట్ ద్వారా ప్రభుత్వం డబ్బులు కూడా కట్టించుకోవడం జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటువంటి మోసాలపై గత 51 రోజులుగా నిరసన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు.

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

జిల్లాలోని దళిత క్రైస్తవులు, దళిత ముస్లిములకు ఎస్సీ హోదా కల్పించాలంటూ ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బవిరెడ్డి శంకరరావు ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

బకాయి జీతాలు చెల్లించాలి

ఎస్.కోట మేజర్ పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు బకాయిలు ఉన్న జీతాలను విడుదల చేయాలంటూ పారిశుధ్య కార్మికులు కోరారు. పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం అందించారు. ఈ పంచాయతీలో బినామీ మస్తర్లతో నడుస్తూ అక్రమంగా ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టినవారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కెరటాంలో వ్యక్తి హత్య?

● మేనల్లుడే చంపాడని భార్య ఆరోపణ

● అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

● పాతిపెట్టిన మృతదేహం వెలికితీత

బొండపల్లి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కెరటాం గ్రామంలో నెడుగట్టి అప్పలకృష్ణ(45) ఆదివారం మృతిచెందాడు. కుటుంబీకులు మద్యం అతిగా తాగడం వల్ల మృతిచెందాడని వారి మత సంప్రదాయం ప్రకారం ఖననం చేశారు. మృతుని భార్య రాజు, మేనల్లుడు నారపాటి సాయి హత్య చేసి ఉంటారని మృతుడి బంధువు పిల్లి సురేష్ ఆదివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో స్థానిక ఎస్ఐ యు.మహేష్, తహసీల్దార్ డి.రాజేశ్వరరావుల సమక్షంలో గజపతినగరం ప్రభుత్వ వైద్యాధికారి రామకృష్ణరాజు సోమవారం మృతిదేహాన్ని వెలికితీసి అక్కడికక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. ఈ విషయమై స్థానిక ఎస్ఐను వివరణ కోరగా.. మృతుడు భార్య రాజుకు, సాయికి సన్నిహిత సంబంధం ఉందని, పలుమార్లు అప్పలకృష్ణ, సాయి మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయని చెప్పారు. ఈనేపథ్యంలో సన్నిహిత సంబంధమే హత్యకు కారణమని, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని తెలిపారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా దర్యాప్తు నిర్వహిస్తామన్నారు.



అప్పలకృష్ణ (ఫైల్)

● మృతుడి భార్య రాజు విలేకర్లతో మాట్లాడుతూ తన మేనల్లుడు నారుపాటి సాయి, తాను మూడేళ్లుగా సన్నిహితంగా ఉంటున్నామని, ఈ విషయమై తన భర్త, సాయి మధ్య ఘర్షణలు జరిగాయని తెలిపారు. సాయి ఏడాది కాలంగా తమ ఇంట్లోనే ఉంటున్నాడని, శనివారం రాత్రి తన భర్తతో పాటు సాయి బయటకు వెళ్లారని, తిరిగి 12 గంటలకు సాయి ఒక్కడే ఇంటికి వచ్చాడని చెప్పారు. మావయ్య ఎక్కడా? అని అడిగితే మద్యంమత్తులో ఉండి పోయాడని చెప్పాడని, ఆ తర్వాత అపస్మారక స్థితిలో ఉన్న అప్పలకృష్ణను ఇంటికి తీసుకొచ్చి పడుకోబెట్టారని ఆమె తెలిపారు. ఉదయం చూసేసరికి తన భర్త చనిపోయాడని ఆమె చెప్పారు. సాయి బెదిరించడంతో తన భర్తకు అంత్రక్రియలు నిర్వహించామని, చంపింది సాయేనని ఆమె ఆరోపిస్తున్నారు.

మా భూములు సాధించుకుంటాం



నిరసన చేస్తున్న జిందాల్ నిర్వాసితులు

ఎస్.కోట రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): డా.బీఆర్ అంబేడ్కర్ తమకు ప్రసాదించిన రాజ్యాంగ పరమైన హక్కులతో శాంతియుతమైన పోరాటం చేసి జిందాల్ కంపెనీకి తాము 18 ఏళ్ల కిందట ఇచ్చిన భూములను తిరిగి సాధించుకుంటామని జిందాల్ నిర్వాసితులు అన్నారు. సోమవారం బొడ్డవర గ్రామం వద్ద 51వ రోజు ఆందోళన కార్యక్రమంలో వారు పాల్గొని, నిరసన తెలిపారు. తమ హక్కుల కోసం ఎంతవరకైనా పోరాడుతామని నినాదాలు చేశారు. వీరికి మద్దతుగా ఎంపీపీ సోమేశ్వరరావు, మాజీ ఎంపీపీ ఒంటి అప్పారావు, నాలుగు పంచాయతీల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన

గజపతినగరం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో సమయ పాలన ఏదీ అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో శనివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జిల్లా పీడీ కార్యాలయం నుంచి అడిషనల్ సీడీపీవో తవిటినాయుడు సోమవారం పలు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. మండలంలోని లోగిస, తుమ్మికాపల్లి, లింగాలవలస, మదుపాడ, బంగారమ్మపేట గ్రామాల్లో గల అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి పిల్లలు, తల్లులతో మాట్లాడారు. అంగన్‌వాడీ కార్యకర్తల పనితీరుపై అడిగి తెలుసు కున్నారు. ఈ అంశాలను పీడీకి అందజేసి, తదుపరి చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి పీవో శకుంతల, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల నిరసన

విజయనగరం కలెక్టరేట్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉచిత బస్సు పథకం ఏర్పాటు చేయడం వల్ల ఆటో, క్యాబ్ డ్రైవర్లకు తీవ్ర నష్టం జరుగుతుందంటూ ఆయా డ్రైవర్లు సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. అలాగే ఆటో, క్యాబ్ డ్రైవర్లపై విధిస్తున్న అధిక చెలానాలను, జీవో 21ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వాహన మిత్ర పథకం ద్వారా రూ.15వేలు అందజేయాలన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

చంద్రన్న వెంటే చేనేత కార్మికులు

● ఎమ్మెల్యే లలితకుమారి

లక్కవరపుకోట, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చేనేత కార్మికులంతా చంద్రబాబు వెంటే ఉన్నారని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. సోమవారం ఆమె గంగుబూడి గ్రామంలో పర్యటించి, చేనేత కార్మికులతో సమస్యలపై చర్చించారు. పవర్ లూమ్స్‌కు ఎలా రాయితీలు, రుణాలు ఇస్తున్నారో హేండ్లూమ్స్ కూడా అటువంటి రాయితీలు ఇవ్వాలని వారు కోరారు. చేనేత కార్మిక సంఘాలను పునరుద్ధరించి, వాటి ద్వారా మగ్గాలు రాయితీపై అందజేయాలలని వారంతా ఎమ్మెల్యేకు విన్నవించారు. ముఖ్యమంత్రితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని ఆమె తెలిపారు. ఈసందర్భంగా చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, లోకేష్ చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. ఏఎంసీ చైర్మన్ చొక్కాకుల మల్లునాయుడు, చేనేత కార్మికుల సంఘం నేత కోనూరు వెంకటరమణ, తామరాపల్లి సర్పంచ్ ఎం.భాస్కరరావు పాల్గొన్నారు. ● గుర్ల: చేనేత కార్మికులు ఎల్లప్పుడూ ముఖ్య మంత్రి చంద్రబాబు వెంటే ఉంటారని ఆప్కో రాష్ట్ర మాజీ డైరెక్టర్ బొమ్మన వెంకటరమణ అన్నారు. సోమ వారం కోట గండ్రేడు గ్రామంలో ముఖ్యమంత్రి చంద్ర బాబు చిత్రపటానికి పాలభిషేకం చేశారు. టీడీపీ నాయకులు శ్రీనివాసరావు, సత్యారావు పాల్గొన్నారు.



మగ్గం నేతను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

'గురుదేవ'కు స్ఫూర్తి సుబ్బలక్ష్మి

కొత్తవలస, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): గురుదేవ చారిటబుల్ ట్రస్టు ద్వారా వివిధ సేవా కార్యక్రమాల నిర్వహణకు స్ఫూర్తి రాపర్తి సుబ్బలక్ష్మి అని ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. గురుదేవ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు తల్లి రాపర్తి సుబ్బలక్ష్మి సంస్మరణ కార్యక్రమాన్ని మంగళపాలెం గ్రామంలోని ట్రస్టు కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ముందుగా సుబ్బలక్ష్మి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్టు చైర్మన్ జగదీష్‌బాబు చేసే ప్రతి కార్యక్రమాన్ని ఆయన తల్లి సుబ్బలక్ష్మి వెనుక ఉండి నడిపించారన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ జగదీష్‌బాబుతో పాటు ఎంపీ నీలంశెట్టి గోపెమ్మ, కొత్తవలస సర్పంచ్ మచ్చ రామస్వామి, తుమ్మికాపల్లి సర్పంచ్ విరోతి కొండలరావు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు గొరపల్లి శివ పాల్గొన్నారు.



సంస్మరణ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కడుబండి

పెండింగ్ పనులు పూర్తిచేయాలి

● నాబార్డు ఈఈ సత్యప్రకాష్

రాజాం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఏరియా ఆసుపత్రిలో పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని నాబార్డు ఈఈ ఎం.సత్యప్రకాష్ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఏరియా ఆసుపత్రి పనులను ఆయన సోమవారం పరిశీలించారు. ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి నుంచి తీవ్ర ఒత్తిడి వస్తుందని.. పనులు సకాలంలో పూర్తి చేయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆసుపత్రిలో ఇప్పటికే ఐదు జనరల్ వార్డుల పనులు పూర్తి చేయక పోవడంతో రోగులు ఉండటానికి ఇబ్బందులు పడుతున్నారు. అన్ని వార్డుల్లోని, గదుల్లోని పనులను సకాలంలో పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. నాబార్డు నిధులు రూ.4.60 కోట్లు నిధులు మంజూరు కాగా, ఇంతవరకు రూ.2.80 కోట్లు బిల్లులు చెల్లించామని చెప్పారు. అదనంగా నాబార్డు నిధులు రూ.38లక్షలు మంజూరయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ గడ్డియ్య, ఆసుపత్రి సూపరింటెండెంట్ కరణం హరిబాబు పాల్గొన్నారు.

విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఎస్‌డబ్ల్యూఏ కార్యవర్గం ఎన్నిక

విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): ఏపీపీటీడీ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ స్టాఫ్ వెల్ఫేర్ ఆసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికను సోమవారం విజయవాడలోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించారు. నోడల్ అధికారులు బి.దేవాళ్లు, ఎస్.వెంకయ్య వ్యవహరించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా డి.అంకినాయుడు, ప్రధాన కార్యదర్శిగా విజయనగరానికి చెందిన టీవీ రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగాఎన్నికైన కార్యవర్గ ప్రతినిధులు మాట్లాడుతూ అసోసియేషన్ అభివృద్ధి కోసం కృషి చేస్తామన్నారు.

ఉత్సాహంగా జెండా ర్యాలీ

హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా సోమవారం విజయనగరం జిల్లాలోని పలు చోట్ల అధికారుల ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



వేపాడలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



గుర్ల: పీఆర్ పేటలో..



మెరకముడిదాం: జెండాలతో ర్యాలీ చేస్తున్న దృశ్యం



చీపురుపల్లి: జెండాలతో బైక్ ర్యాలీ చేస్తున్న అధికారులు

విశాఖ ఆర్టీసీ బస్టాండ్‌లో మహిళ మృతి

విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎస్.కోటకు చెందిన గేదెల ముత్యాలమ్మ అనే మహిళ విశాఖపట్టణంలోని ద్వారక బస్టాండ్‌లో గల 25వ ప్లాట్‌ఫాంలో బస్సు ఢీకొని మృతిచెందింది. ఈ ఘటన సోమవారం చోటుచేసుకుంది. శ్రీకాకుళం నుంచి విశాఖపట్టణం వెళ్లే బస్టాప్ వద్ద మధ్యాహ్న సమయంలో ముత్యాలమ్మ బస్సు కోసం వేచిఉంది. బస్సు ఎక్కేందుకు ప్లాట్‌ఫాం సమీపంలోకి వెళ్లింది. దీంతో ప్రమాదవశాత్తు బస్సు ఢీకొట్టింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది.

పాము కాటుతో వృద్ధురాలి మృతి

గరివిడి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): గరివిడి పట్టణంలో బీసీ కాలనీకి చెందిన వరదా సత్యవతి(60) అనే మహిళ పాము కాటుకు గురై మృతిచెందింది. ఆదివారం రాత్రి ఇంటిలో మంచంపై పడుకున్న సత్యవతి తెల్లవారి లేచేసరికి అపస్మారక స్థితిలో ఉండడాన్ని కుటుంబీకులు గమనించారు. ఆమెను విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరిశీలించి ఈమె పాము కాటుకు గురైందని, అప్పటికే మృతిచెందిందని నిర్ధారించారు. గరివిడి ఎస్ఐ లోకేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్లు జైలు

విజయనగరం క్రైం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గుర్ల పోలీసుస్టేషన్‌లో 2022లో నమోదైన పోక్సో కేసులో నిందితుడు గుర్ల మండలం పెనుబర్తి గ్రామానికి చెందిన గుడిసె సూర్యనారాయణ అలియాస్ సూర్యకు పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయాధికారి కె.నాగమణి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, 3వేలు జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు వెల్లడించినట్టు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఎస్పీ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుర్ల మండలంలో నివాసం ఉంటున్న 16 ఏళ్ల బాలిక చదువుపై ఆసక్తి లేకపోవడంతో ఇల్లు విడిచివెళ్లిపోయినట్టు తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై గుర్ల పోలీసులు అప్పట్లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. అనంతరం బాలిక అచూకీ లభ్యం అయ్యింది. విచారణలో తనను సూర్యనారాయణ ప్రేమ పేరుతో లైంగిక వేధింపులకు గురిచేసి అత్యాచారానికి పాల్పడినట్టు ఆమె తెలిపింది. దీంతో అప్పటి ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు పోక్సో కేసుగా మార్పు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం మహిళా పీఎస్ డీఎస్పీ తదుపరి దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించి, అభియోగ పత్రం దాఖలు చేశారు. దీంతో సూర్యనారాయణపై నేరం రుజువు కావడంతో జైలు శిక్షతో పాటు బాధితురాలికి రూ.2లక్షల పరిహారాన్ని మంజూరు చేస్తూ పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి తీర్పు వెల్లడించినట్టు ఎస్పీ తెలిపారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడే విధంగా పనిచేసిన పోలీసులను ఆయన అభినందించారు.

గంజాయి కేసులో ఇద్దరికి రెండేళ్లు..

విజయనగరం క్రైం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని టూటౌన్ పోలీసు స్టేషన్‌లో 2024లో నమోదైన గంజాయి కేసులో ఇద్దరు నిందితులకు రెండేళ్ల జైలు శిక్ష ఒక్కొక్కరికి రూ.10వేలు జరిమానా విధిస్తూ విజయనగరం ఒకటవ ఏడీజే న్యాయాధికారి ఎం.మీనాదేవి సోమవారం తీర్పు వెల్లడించినట్టు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 2024 ఆగస్టు 25న శ్రీనివాస్‌నగర్‌లోని కోమటిచెరువు వద్ద నగరానికి చెందిన ఉమంది ఎల్లయ్య, బోని యాసఫ్‌లు అక్కడ ఉన్న పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. దీంతో పోలీసులు వారిని పట్టుకుని, వారి వద్ద నుంచి 3.1 కిలోలు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సీఐ శ్రీనివాసరావు వారిని రిమాండ్‌కు తరలించి, అభియోగపత్రాలు దాఖలు చేశారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో విజయనగరం ఒకటవ ఏడీజే న్యాయాధికారి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. నిందితులకు శిక్ష పడేందుకు కృషి చేసిన సీఐ శ్రీనివాసరావు, సిబ్బందిని ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు.

హమ్మయ్య తుపాకీ దొరికింది

కొత్తవలస, ఆగస్టు 11ఆంధ్రజ్యోతి): ముసిరాం గ్రామంలో ఈనెల 5న అదే గ్రామానికి చెందిన శిమ్మ అప్పారావును అనకాపల్లి జిల్లాకు చెందిన ఎస్.అప్పారావు తుపాకీతో కాల్చి హత్య చేసిన విషయం తెలిసిందే. నిందితుడిని ఇటీవల అనకాపల్లి జిల్లా కశింకోటలో ఎట్టకేలకు అదుపులోకి తీసుకున్నారు. అయితే తుపాకీ ఆచూకీ తెలియచేయడానికి నిందితుడు పోలీసులను ముప్పుతిప్పలు పెట్టాడు. చివరకు సీఐ షణ్ముఖరావు రంగంలోకి దిగి తనదైన శైలిలో విచారణ చేశారు. సోమవారం తుపాకీ ఆచూకీ కనుగొని స్వాధీనం చేసుకున్నారు.

రెండు బస్సులు ఢీ..

● ఒకరికి తీవ్ర గాయాలు.. ఆరుగురికి స్వల్ప గాయాలు

కొత్తవలస, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలపాలెం సమీపంలోనున్న పాత ఖాటా వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక విద్యార్థికి తీవ్ర గాయాలు కాగా మరో ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. లక్కవరపుకోట మండలంలో కొట్యాడలోనున్న బెహరా పాలిటెక్నిక్ కళాశాలకు విశాఖ నుంచి విద్యార్థులను, బోధనా సిబ్బందిని తీసుకొస్తున్న బస్సు, కొత్తవలస నుంచి విశాఖపట్టణం మధురవాడ ఐటీ సెజ్‌కు వెళ్తున్న సిటీ బస్సు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కృతి అనే విద్యార్థినికి గాయాలు కాగా, మరో ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన విద్యార్థులను చికిత్స నిమిత్తం విశాఖపట్టణం తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పేలుడు సామగ్రి పట్టివేత

వేపాడ, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): సోంపురం గ్రామంలో ఓ వ్యక్తి వద్ద నుంచి రూ.3,220 విలువ గల పేలుడు సామగ్రిని పట్టుకున్నట్టు వల్లంపూడి ఎస్ఐ సుదర్శన్ తెలిపారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు ఎస్.కోట రూరల్ సీఐ అప్పలనాయుడు సారథ్యంలో సోమవారం నిర్వహించిన కార్డన్ సెర్చ్ నిర్వహిస్తుండగా గ్రామానికి చెందిన గొర్లె సింహాచలం ఇంట్లో రూ.3,220 విలువ గల పేలుడు సామగ్రి లభించింది. ఈ మేరకు సింహాచలం అనే వ్యక్తిపై కేసు నమోదు చేయడంతో పాటు ప్రేలుడు సామాగ్రిని స్వాధీన పర్చుకున్నట్టు ఎస్ఐ తెలిపారు.ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

బొబ్బిలి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ముగ్గురికి ఒక్కొక్కరికి రూ.10వేలు వంతున, బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగుతున్న ఆరుగురికి ఒక్కొక్కరికి రూ.500 వంతున బొబ్బిలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారిణి జె.హేమస్రవంతి సోమవారం జరిమానా విధించారని సీఐ సతీష్‌కుమార్ తెలిపారు. బొబ్బిలి ప్రాంతంలో పట్టుబడిన వీరిపై కేసు నమోదు చేసి, కోర్టులో ప్రవేశపెట్టగా, న్యాయాధికారి జరిమానా విధించారని సీఐ చెప్పారు.

చీడిమానుగూడలో వైద్యశిబిరం



గిరిజనులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సీతంపేట రూరల్,ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): చీడిమానుగూడలో మర్రిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి బి. సత్యవేణిఆధ్వర్యంలో సిబ్బంది వైద్యశిబిరంనిర్వహించారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో గిరిజనులకు తప్పని డోలిమోతలు శీర్షికతో కథనం ప్రచురితంకావడంతో వైద్యసిబ్బంది స్పందించారు.జ్వరంతో బాధపడుతున్న బాలికను డోలికట్టి దిగువప్రాంతానికి తీసుకువచ్చిన కథనంతో ఐటీడీఏఅధికారులు, వైద్యసిబ్బంది గ్రామాన్ని సందర్శించారు. జ్వరంతో బాధపడి కోలుకున్న బాలికను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో యాంటీమలేరియా మందు పిచికారీ చేశారు.

గిరిజన విద్యార్థుల ప్రాణాలు కాపాడండి

గుమ్మలక్ష్మీపురం/కురుపాం/పార్వతీపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో గతంలో పనిచేసిన ఆదివాసీ ఆరోగ్య సిబ్బందిని నియమించి గిరిజన విద్యార్థుల ప్రాణాలు కాపాడాలని గిరిజన సంక్షేమ సంఘం, గిరిజన విద్యార్థి సంఘం, గిరిజన అభ్యుదయ సంఘం నాయకులు గణేష్, శ్రీరంజని, సుభాషిణి, నిర్మల, సత్యవతి, సంతోషి కోరారు. ఈ మేరకు అమరావతి సచివాలయంలో గిరిజన సంక్షేమ ముఖ్య కార్యదర్శి ఎంఎం నాయక్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు పాలక రంజిత్‌కుమార్, పల్ల సురేష్, ఆరిక చంద్రశేఖర్ మాట్లాడుతూ గురుకుల, ఏకలవ్య, కస్తూరిబా, జ్యోతీరావుపూలే విద్యా సంస్థల్లో ఏఎన్‌ఎంలు ఉన్నారని, గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లోనే వైద్య సిబ్బంది లేరని తెలిపారు.ఐటీడీఏలో ఇన్‌చార్జి ప్రాజెక్టు అధికారులుగా ఉన్న అశుతోష్ శ్రీవాస్తవ, యశ్వంత్‌కు మార్‌రెడ్డిలను రెగ్యులర్ ప్రాజెక్టు అధికారులుగా కొనసాగించాలని, ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్‌ఎంలను నియమించాలని కోరారు.

రైతులకు ఎరువులు అందించాలి

పాలకొండ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రైతులకు అవసరమైన ఎరువులను అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు కోరారు.ఈమేరకు కలెక్టరేట్‌లో రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఇవీ నాయుడు, భామిని మండల కార్యదర్శి కొత్తకోట బాబూరావునాయుడు, బుడితి మోహన్‌రావులో కలిసి కలెక్టర్ శ్యాంప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ భామిని మండలం రైతులు ఎరువులను ప్రైవేటు డీలర్ల నుంచి కొనుగోలుచేస్తున్నారని, ప్రైవేటు డీలర్లు ఒడిశాలో అధిక ధరలకు అమ్ముకుని ఆంధ్రా రైతులకు అన్యాయం చేస్తున్నారన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించాలి

గరుగుబిల్లి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి):ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించేందుకు కృషి చేయాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ ఎం.శ్రావణ్‌కుమార్‌నాయుడు సూచించారు. సోమవారం మండలంలోని తోటపల్లిలోని జట్టు ట్రస్ట్ కార్యాలయంలో సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ డి.పారినాయుడు అధ్యక్షతన కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాలకు చెందిన ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జట్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రహరాజ్, కన్సల్టెంట్ రమాప్రభ, ప్రవీణ్‌కుమార్, సిలబస్ కన్సల్టెంట్ టి.శివాజీ పాల్గొన్నారు.

పనుల్లో లోపాలు ఉంటే చర్యలు: ఎస్‌ఆర్‌పీ

గరుగుబిల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన పనుల్లో నాణ్యత లోపాలు ఉంటే చర్యలు తప్పవని రాష్ట్ర ఎస్‌ఆర్‌పీ ఈదుబిల్లి పున్నపునాయుడు హెచ్చరించారు. సోమవారం మండలంలోని సంతోషపురం పంచాయతీ పిట్టలమెట్టతోపాటు పలు గ్రామాల్లోని సీసీ రహదారులు, బీటీ రహదారుల పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధి పనులకు సంబంధించి అంచనాల్లో రూపొందించిన మేరకు కొలతలు లేకుంటే సంబంధిత సిబ్బందిపై రికవరీకి సిఫార్సు చేస్తామని తెలిపారు. మండలానికి సంబంధించి 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వేతనాలు, అభివృద్ధి పనులకు రూ. 20 కోట్లు వ్యయం జరిగిందన్నారు. పూర్తిస్థాయి నివేదికలను ఈ నెల 22న నిర్వహించనున్న ప్రజావేదికలో బహిర్గతం చేస్తామని తెలిపారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించండి

వీరఘట్టం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఎరువుల షాపుల్లో రికార్డులు సక్రమంగా నిర్వహించాలని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. సోమవారం వీరఘట్టంలో ఎరువులు,పురుగుమందులు షాపులు అధికారులు తనిఖీలు నిర్వహించారు.ఈసందర్భంగా రిజిస్టర్, ఈపాస్ మిషన్ బ్యాలెన్స్, గ్రౌండ్ బ్యాలెన్స్‌లు సరిగా నిర్వహించకపోవడంతో పలు దుకాణాల్లో రూ.9,74,920 విలువ గల ఎరువుల అమ్మకాలను నిలిపివేసినట్లు ఏడీఏ రత్నకుమారి తెలిపారు. ఆమె వెంట ఏవో సౌజన్య ఉన్నారు.

37 మద్యం సీసాలు స్వాధీనం

గరుగుబిల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి):ఉల్లిభద్ర సమీపంలోని ఎర్రన్న గుడిసముదాయంలోని దుకాణంనుంచి తరలిస్తున్న 37మద్యం సీసాలను దళాయివలస సమీపంలో సోమవారంస్వాధీనం చేసుకున్నట్లు గరుగుబిల్లి ఎస్‌ఐ పి.రమేష్‌నాయుడు తెలిపారు.గ్రామాల్లో బెల్ట్‌దుకాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్న ఎక్సైజ్ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. కాగా మద్యం దుకాణాల పరిధిలో బెల్టు దుకాణాలు నిర్వహించకుండా నిఘా ఏర్పాటు చేశామని సీతానగరం ఎక్సైజ్ సీఐ పద్మావతి తెలిపారు.

మితిమీరిన వేగంతో నడిపితే కేసులు: ఎస్‌ఐ

సీతంపేట రూరల్,ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఆటోడ్రైవర్లు, ద్విచక్ర వాహనచోదకులు మితిమీరిన వేగంతో వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ వె.అమ్మనరావు తెలిపారు.స్థానిక వారపుసంత ఆవరణలో రహదారి ప్రమాదాల భద్రతపై ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పించారు.

●మక్కువ, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపిన వారికి పోలీస్ నిబంధనల ప్రకారం జరిమాన విధిస్తామని మక్కువ ఎస్‌ఐ ఎం.వెంకటరమణమూర్తి హెచ్చరించారు. సోమవారం చినభోగిలి, సాలూరు వెళ్లే జంక్షన్‌లో వాహనాలను తనిఖీనిర్వహించారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

పార్వతీపురం రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ పరిధిలో ఉన్న గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని గోచక్క మాజీ సర్పంచ్, టీడీపీ నాయకులు ఎన్.సింహాచలం కోరారు. గిరిజనులు కలెక్టర్ శ్యాంప్రసాద్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. సమస్యను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారి ప్రభాకరరావును కలెక్టర్ ఆదేశించారు.

సీపీఐ జిల్లా కార్యవర్గం ఎన్నిక

బెలగాం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మథరావు తెలిపారు. సోమవారం పార్వతీపురంలో విలేకరులతో మాట్లాడుతూ పాలకొండలో ఈ నెల 8,9 తేదీల్లో జరిగిన జిల్లా మహాసభలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు చెప్పారు. జిల్లా కార్యదర్శిగా కె.మన్మథరావు, కార్యవర్గ సభ్యులుగా బుడితి అప్పల నాయుడు, లింగరాజు, ఈవి నాయుడు, ఆర్వీఎస్ కుమార్, నీలమ్మ, గోపినాయుడు, 29 మంది జిల్లా సమితి సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు.పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్న తోట జీవన్, గరుగుబిల్లి సూరయ్యలను బహిష్కరించినట్లు తెలిపారు.

రెగ్యులర్ ఉపాధ్యాయుడిని నియమించాలి

గుమ్మలక్ష్మీపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి):గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలో రెగ్యులర్ ఉపాధ్యాయుడిని తక్షణమే నియమించాలని దుడ్డుఖల్ పంచాయతీపరిధిలోగల కొత్తవలస గ్రామస్థులు డిమాండ్ చేశారు. సోమవారం పాఠశాల ఎదుట నాయకులు నిమ్మక ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో తల్లిదండ్రులు మాజీ సర్పంచ్ నిమ్మక కంశాలమ్మ, కద్రక రాంబాబు ఆందోళన నిర్వహించారు.

గిరిజనులకు పోడు పట్టాలు: మంత్రి



కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సంధ్యారాణి

సాలూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): గిరిజనులకు ఈనెల 15న పంపిణీచేయనున్న పోడు భూమి పట్టాలు ఏ పార్టీకి చెందినవారా, తనకు ఓటు వేశారే లేదా అనే అంశం చూడనని, కేవలం పేద గిరిజనులైతే చాలని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. అక్టోబరు రెండో తేదీ గాంధీ జయంతి రోజున కూడా మరికొంతమంది పేద గిరిజన రైతులకు పోడు పట్టాలను అందజేస్తామని చెప్పారు. సోమవారం సాలూరులో విలేకరులతో మాట్లాడుతూ గతంలో ఎన్నడూలేని విధంగా ప్రపంచ ఆదివాసీ దినత్సోవం రోజున ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గిరిజనులకు వరాల వర్షాన్ని కురిపించారని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా పనిచేసిన పీడిక రాజన్నదొర ఏం మాట్లాడుతున్నారో అర్థం కావడంలేదన్నారు. 18 ఏళ్లుగా ఎమ్మెల్యేగా, ఉప ముఖ్యమంత్రిగా పనిచేసిన ఆయన ఇంటి ముందు రోడ్డును కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నిర్మించినట్లు తెలిపారు. సాలూరులో అనేక ప్రభుత్వ భవనాలు టీడీపీఅధికారంలో ఉన్న సమయంలో నిర్మాణాలు జరిగాయని ఆమె తెలిపారు. ఆమె వెంట పట్టణ టీడీపీ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, ఆముదాల పరమేశు, గుళ్ల వేణుగోపాలనాయుడు, గూడెపు యుగంధర్, కేతిరెడ్డి చంద్రశేఖర్, హర్షా, కారేపు చంద్ర ఉన్నారు. అలాగే మండలంలోని జీగిరాం పంచాయతీకి చెందిన 50 కుటుంబాలు మంత్రి సమక్షంలో టీడీపీలో చేరాయి. వారిని మంత్రి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

పీఏసీఎస్ అభివృద్ధికి కృషి: విప్



అన్నక్యాంటీన్ భవన నిర్మాణం కోసం శంకుస్థాపన చేస్తున్న జగదీశ్వరి

కురుపాం, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): కురుపాం పీఏసీఎస్ అభివృద్ధికి కృషి చేస్తానని ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. సోమవారం కురుపాంలో పీఏసీఎస్ చైర్మన్‌గా డోల్లు కిషోర్, డైరెక్టర్లగా కర్రి సత్యంనాయుడు,తంగుడు సత్యనారాయణ ప్రయాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్, ట్రైకార్ బోర్డు డైరెక్టర్ పువ్వల లావణ్య, డొంకాడ రామకృష్ణ, వెంకటనాయుడు పాల్గొన్నారు.

●కురుపాంలో ఎంపీడీవో కార్యాలయం సమీపంలో అన్న క్యాంటీన్ భవనం నిర్మాణం కోసం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కేవీ కొండయ్య, రంజిత్‌కుమార్, ఎంపీడీవో నాగభూషణరావు పాల్గొన్నారు.

●కొమరాడ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కొరిశీల గ్రామానికి చెందిన సిగురు ఉదయ్‌కిరణ్, కార్తీక్, దువ్వాన జగన్ కొమరాడలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి వారి కుటుంబాలను పరామర్శించారు. ఆమె వెంట టీడీపీ మండలాధ్యక్షుడు శేఖర్‌పాత్రుడు, హిమరిక బలరాము, రామారావు, ప్రతాప్ ఉన్నారు.

అర్జీదారులు అసంతృప్తి చెందకూడదు: కలెక్టర్

పార్వతీపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారంలో ఏ ఒక్క అర్జీదారుడు అసంతృప్తి చెందకూడదని కలెక్టర్ శ్యాంప్రసాద్ తెలిపారు. పార్వతీపురం కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌కు 96 వినతులు అందాయి. కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్, జేసీ శోభిక, డీఆర్వో కె.హేమలత, డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణితో కలిసి అర్జీలు స్వీకరించారు.ఈ సందర్భంగా పార్వతీపురం మండలంలోని తాళ్లబురిడికి తాగునీరు సదుపాయాలని కల్పించాలని గ్రామస్థులు కోరారు. పాచిపెంట మండలంలోని తాడూరు, శీల గ్రామానికి చెందిన 31 మంది రైతులు 30 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న భూమికి పట్టాలు మంజూరు చేయాలని టి.పార్వతి, తదితరులు వినతిపత్రం సమర్పించారు. కాగా ఎక్కువగా వ్యక్తిగత సమస్యలపై వినతులు అందాయి.

'అన్నదాత సుఖీభవ' వినతుల స్వీకరణ

పార్వతీపురంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అన్నదాత సుఖీభవ మంజూరుకాలేదని పలువురు అందజేసిన వినతులను అధికారులు స్వీకరించారు. కాగా అన్నదాత సుఖీభవ పథకం అందలేదని కొన్ని దరఖాస్తులు అందాయని, కలెక్టర్ ఆదేశాలమేరకు పరిశీలించి చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్ తెలిపారు.

ఫిర్యాదుల పరిష్కారమే ధ్యేయం: ఎస్పీ

బెలగాం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఫిర్యాదుల పరిష్కారమే ధ్యేయంగా పని చేయాలని ఎస్పీ ఎస్‌వీబీమాధవరెడ్డి ఆదేశించారు. పోలీస్ జిల్లా కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో ఐదు ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో డీసీఆర్‌బీ ఎస్‌ఐ ప్రక్రుద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

పీజీఆర్‌ఎస్‌కు 39 వినతులు

సీతంపేట రూరల్,ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి):స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఏపీవో జి.చిన్నబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు పలు సమస్యలు పరిష్కారం కోరుతు గిరిజనుల నుంచి 39 వినతులు వచ్చాయి. కార్య క్రమంలో డీడీ అన్నదొర, డిప్యూటీ ఈవో రామ్మోహనరావు, ఏఎంవో కోటిబాబు, ఉపాధి, వెలుగు ఏపీడీలు శ్రీహరి,సన్యాసిరావు, ఏవో వై.వాహిణి పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జెండా ఎగరాలి



బెలగాం: హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

బెలగాం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) :పతి ఇంటిపై జాతీయ జెండా ఎగుర వేయడమే ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ముఖ్య ఉద్దేశ్యమని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. సోమవారం పార్వతీపురంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి కలెక్టరేట్ వరకు అజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థినులు, అధ్యాపకులు హర్ ఘర్‌తిరంగా ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ బుధవారం నుంచి ఈనెల 15 వరకు నిర్వహించిన తిరంగా అజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు.

●కురుపాం,ఆగస్టు11(ఆంధ్రజ్యో): స్థానిక జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రిన్సిపాల్ ఎం.కుమారస్వామి ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్‌అధికారులు రామమోహనరావు, రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

● గరుగుబిల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గరుగుబిల్లిలో సోమవారం బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో తరంగా ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండలాధ్యక్షుడు పి.అశోక్‌కుమార్ మాట్లాడుతూ 25 పంచాయతీల పరిధిలో ఈ నెల 15నజాతీయజెండాను ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సత్యనారాయణ, ఎస్.శ్రీనివాసరావు, పి.సురేష్ పాల్గొన్నారు.

● భామిని, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): భామిని జూనియర్ కళాశాల నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నారాయణరావు పాల్గొన్నారు.

●మక్కువ, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): జాతీయజెండాను గౌరవించాలని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.మంజులవీణ కోరారు.మక్కువలో హర్‌ఘర్ తిరంగార్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం పీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

●సాలూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మునిసిపల్ కమిషనర్ కమిషనర్ టీటీరత్నకుమార్, డీఈ ప్రసాదరావు, శానటరీ ఇన్‌స్పెక్టర్ ఎల్.బాలకృష్ణల ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద మానవహారం చేపట్టారు.

ఉపాధి కల్పించి ఆదుకోవాలి

● పార్వతీపురంలో ఆటో కార్మికుల నిరసన



పాలకొండ: ర్యాలీ నిర్వహిస్తున్న ఆటోడ్రైవర్లు

బెలగాం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఉచిత బస్సు పథకంతో తీవ్ర అన్యాయానికి గురవుతామని, ఉపాధి కల్పించి ఆదుకోవాలని ఆటో డ్రైవర్లు డిమాండ్ చేశారు. సోమవారం పార్వతీపురంలోని పాత బస్టాండ్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటో కార్మికులు ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపి కలెక్టర్ శ్యాంప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సీఐటీయూ నాయకులు వై.మన్మథరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 15 నుంచి ఉచిత బస్సు పథకాన్ని అమలుచేస్తామని ప్రకటించిందని, ఈ పథకం అమలు తర్వాత 60 శాతం మందికి ఉపాధి పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

వాహనమిత్ర పథకాన్ని ప్రకటించాలి

పాలకొండ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఆటో, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు రాష్ట్ర ప్రభుత్వం వాహనమిత్ర పథకాన్ని ప్రకటించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఆటో, క్యాబ్ డ్రైవర్ల సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ ప్రభుత్వం ఈనెల 15 నుంచి ఉచిత బస్సు పథకం ప్రారంభించకముందే వాహన మిత్ర పథకాన్ని అందించాలన్నారు. డ్రైవర్ల మెడకు ఉరితాడుగా ఉన్న జీవో-21ను రద్దు చేయాలన్నారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలోఆటో డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు కాద రాము, రాజశేష్, మహేష్, రాము, సుదర్శనరావు, కామేష్, సంగమేషు, రాంబాబు, ఎకరకరావు, సతీష్, దుర్గారావు, వేణు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పునర్విభజన కష్టాలు!

(5వ పేజీ తరువాయి)

బస్సులు మారాలి. భామిని నుంచి కొత్తూరు అక్కడి నుంచి పాలకొండ మీదుగా పార్వతీపురం చేరుకోవాల్సి వస్తోంది. పార్వతీపురానికి నేరుగా వెళ్లేందుకు బస్సులు లేకపోవడంతో భామిని మండల వాసులు ఓ రోజు ప్రయాణించాల్సి వస్తోంది. అదే శ్రీకాకుళం జిల్లాకేంద్రానికి వెళ్లాలంటే ప్రతి అరగంటకు ఓ బస్సు అందుబాటులో ఉండడంతో అక్కడే వారు విద్య, వైద్య సేవలు పొందుతున్నారు. భామిని మీదుగా బత్తిలి గ్రామానికి ప్రతి 30 నిమిషాలకు ఆర్టీసీ బస్సులు తిరుగుతుంటాయి. దీంతో ప్రజలు శ్రీకాకుళం వైపు ఎక్కువగా వెళ్తుంటారు.

● ఏదేమైనా గత ప్రభుత్వ హయాంలో జిల్లాల విభజన అస్తవ్యస్తంగా జరిగినట్లు కూటమి సర్కార్ గుర్తించిన నేపథ్యంలో భామిని మండలవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు దీనిపై దృష్టి సారించి రానున్న రోజుల్లో శ్రీకాకుళం జిల్లాలోనే విలీనం చేసేలా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

రైట్.. రైట్!

(5వ పేజీ తరువాయి)

మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించింది. కాగా జిల్లాలో సాలూరు, పార్వతీపురం, పాలకొండ డిపోల్లో మొత్తం 240 బస్సులున్నాయి. ప్రస్తుతం ప్రతినెలా 2.60 లక్షల మంది మహిళలు ప్రయాణాలు చేస్తున్నట్లు ఒక అంచనా. ఈ నేపథ్యంలో జిల్లాకు అదనంగా మరో 40 బస్సులు అవసరమున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని వెల్లడించారు. ప్రభుత్వానికి కోటీ 25 లక్షల రూపాయల పైబడి భారం పడే అవకాశముందని ఆర్టీసీ వర్గాలు తెలిపాయి.

అశుతోష్, యశ్వంత్ సేవలు ప్రశంసనీయం

బెలగాం/పార్వతీపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : పార్వతీపురం సబ్ కలెక్టర్, ఇన్‌చార్జి పీవోగా విధులు నిర్వహించిన అశుతోష్ శ్రీవాస్తవ, పాలకొండ సబ్ కలెక్టర్, సీతంపేట ఇన్‌చార్జి పీవోగా విధులు యశ్వంత్ కుమార్‌రెడ్డి నిర్వహించిన సేవలు ప్రశంసనీయమని కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ తెలిపారు. బదిలీపై వెళ్తున్న వీరిద్దరిని సోమవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్, జేసీ శోభిక ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీఆర్వో హేమలత పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్‌గా రవిచంద్ర

బెలగాం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం సబ్ రిజిస్ట్రార్‌గా జి.రవి చంద్ర కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విజయనగరం జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించిన ఆయన పదోన్నతిపై పార్వతీపురం సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీపై వచ్చారు.

ట్రస్టు బోర్డు కోసం దరఖాస్తులు ఆహ్వానం

గరుగుబిల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తోటపల్లిలోని వేంకటేశ్వర, కోదండరామస్వామి దేవస్థానాలకు ట్రస్టుబోర్డుకోసం అర్హులైన వారు ఈనెల 30లోగా దరఖాస్తులు అందజేయాలని దేవస్థానం ఈవో వీవీ సూర్యనారాయణ కోరారు. సోమవారం తోటపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ దేవస్థానానికి సంబంధించి ఏపీ చారిటబుల్, హిందూ రీలిజియన్ దేవాలయాలకు చట్టం 30/87 మేరకు ధర్మ కర్తల పదవులకు దరఖాస్తులు కోరినట్లు తెలిపారు. సంబంధిత వ్యక్తులు మన్యం జిల్లా కేంద్రంలోని జిల్లా దేవాదాయశాఖ అధికారికి దరఖాస్తు అందించాలన్నారు.

పొంజాడలో హెల్పర్ మృతి

సీతంపేట రూరల్,ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి):మండలంలోని పొంజాడలో అనారోగ్యంతో బాధపడుతు అంగన్‌వాడీ హెల్పర్ సవర నల్లమ్మ(44) సోమవారం మృతిచెందింది. పొంజాడలో హెల్పర్‌గా పనిచేస్తున్న నల్లమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోందని గ్రామస్థులు తెలిపారు.వైద్యం కోసం విశాఖ తీసుకు వెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని నల్లమ్మ భర్త తోటయ్య తెలిపాడు.

సక్రమంగా తాగు నీరందాలి

పాలకొండ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రజలకు మంచినీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ రత్నంరాజు కోరారు. పట్టణంలోని తెలుకలవానిచెరువు సమీపంలో కొళాయి పైపులైన్లు దెబ్బతినడంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈమేరకు తాగు నీటి సరఫరాను పునరుద్ధరించే పనులను కమిషనర్ సోమవారం పరిశీలించారు.

నేడు పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

మక్కువరూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనసభద్ర ఏకలవ్య గురుకుల పాఠశాలలో మూడు పోస్టులు భర్తీకి 21 దరఖాస్తులు అందాయని ప్రిన్సిపాల్ కుప్పిలి సురేష్ తెలిపారు.ఈ మేరకు మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఆది కర్మయోగిపై శిక్షణ

పార్వతీపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఆది కర్మయోగి కార్యక్రమం జిల్లాలో విజయవంతంగా నిర్వహించాలని పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల ఇన్‌చార్జి పీవోలు అశుతోష్ శ్రీవాస్తవ, యశ్వంత్‌కుమార్‌రెడ్డి కోరారు. సోమవారం పార్వతీపురం ఐటీడీఏ గిరిమిత్ర సమావేశ మందిరంలో స్టేట్ మాస్టర్ ట్రైనీ, ఏపీవో మురళీధర్ ఆధ్వర్యంలో వివిధ శాఖలకు చెందిన మండలస్థాయిఅధికారులు, సిబ్బందికి శిక్షణ అందించారు. ఈ సందర్భంగా ఆదికర్మయోగి కార్యక్రమం ఏ విధంగా నిర్వహించాలి, గ్రామస్థాయిలో శిక్షణను ఏ విధంగా అందించాలనే అంశాలపై పీవోలు అవగాహన కల్పించారు. జిల్లా మాస్టర్ ట్రైనీలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జియ్యమ్మవలస, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి):చినకుదమ సబ్‌స్టేషన్ పరిధిలో గల చినకుదమ, టీఎన్‌వలస, చింతల బెలగాం, ఇటిక, కేటీవాడ, జీటీవాడ పంచాయతీల్లో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ట్రాన్స్‌కో ఏఈ బి.శంకరరావు తెలిపారు. 33 కేవీ మేరంగి పరిధిలో చెట్లు తొలగించడంతో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

●కురుపాం,ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం నుంచి కురుపాం 33 కేవీ లైన్‌లో చెట్టుకొమ్మలు తొలగించడం, ఆర్‌డీడీఎస్ పనులు చేయనుండడంతో మంగళవారం కురుపాంలో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ ఎం.రాజేంద్ర ప్రసాద్ తెలిపారు.

● గరుగుబిల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి):గరుగుబిల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని సీతారాంపురం, ఉల్లిభద్ర, కొంకడివరం, రాయిందొరవలస, సన్యాసిరాజుపేటకు మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ బడే శ్రీనివాసనాయుడు తెలిపారు. వ్యవసాయ విద్యుత్ మోటార్లకు, గ్రామాలకు ప్రస్తుతం సరఫరా అవుతున్న విద్యుత్ లైన్లను సపరేట్ చేయనున్నట్లు పేర్కొన్నారు.

నేడు అన్నదాతల ర్యాలీ

సాలూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంగళవారం అన్నదాత విజయోత్సవ ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి మంత్రి గుమ్మిడి సంధ్యారాణి హాజరుకానున్నారు.